డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
మంగళవారం 15 సెప్టెంబర్ 2026



## అసెంబ్లీ గేటు వద్ద వివాదం కేసు.

- కేటీఆర్ పీఏ, పీఆర్ఓ పోలీసుల విచారణకు హాజరు.
- అసెంబ్లీ వద్ద గొడవ కేసులో కేటీఆర్ సహాయకుల విచారణ.
- సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో పీఏ, పీఆర్ఓల హాజరు.
- సెప్టెంబర్ 7 నాటి ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.
- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురిపై ఇప్పటికే కేసులు.
- పోలీసులపై బీఆర్ఎస్, బీఆర్ఎస్‌పై పోలీసులు పరస్పర ఆరోపణలు.

2



## మరో 18 నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ప్రకటించిన కవిత.

- వినాయక చవిత సందర్భంగా పలు నియామకాలను చేపట్టిన కవిత.
- ఇప్పటి వరకు 60 స్థానాలకు ఇన్‌చార్జుల నియామకం పూర్తి.
- మెదక్ లోక్‌సభ స్థానానికి కూడా అధ్యక్షుడిని ప్రకటించిన కవిత.



2

# తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రేసులో అశోక్ గెహ్లాట్!

ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ విదేశీ పర్యటన.
ఉన్నత విద్య కోసం 10 నెలలు సెలవుపై వెళ్లనున్న మీనాక్షి.
రేసులో గెహ్లాట్‌తో పాటు ముకుల్ వాస్నిక్, శక్తిసిన్హ్ గోహిల్ పేర్ల పరిశీలన.
త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్న కాంగ్రెస్ అధిష్టానం.



2 లో...

**జనం వాయిస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 14:**
*తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య నిమిత్తం సుదీర్ఘ సెలవుపై వెళ్లనుండటంతో, ఆమె స్థానంలో గెహ్లాట్ పేరును పార్టీ అధిష్ఠానం ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.*

# కుటుంబంతో కలిసి గణపతి పూజలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

*తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు.*
*కుటుంబ సభ్యులతో కలిసి గణపతికి ప్రత్యేక పూజలు.*
*అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి విజయాలు రావాలని ఆకాంక్ష.*
*పూజకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సీఎం.*

2



# అల్వాల్‌లో దారుణం: ఇంటర్ విద్యార్థినిపై 8 మంది అత్యాచారం!

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 14:**
హైదరాబాద్ అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ బాలికపై నెలల తరబడి 8 మంది వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఈ ఘోరం బయటపడగా, పోలీసులు 8 మంది నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు వెల్లడించిన

- మిగతా 2 లో ...

దైనిక్ జనం వాయిస్ RNI NO:TGTEL/26/A0383 తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM



# తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రేసులో అశోక్ గెహ్లాట్!

**జనం వాయిస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 14:**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య నిమిత్తం సుదీర్ఘ సెలవుపై వెళ్లనుండటంతో, ఆమె స్థానంలో గెహ్లాట్ పేరును పార్టీ అధిష్ఠానం ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లనున్నారు. ఇందుకోసం ఆమె సుమారు 10 నెలల పాటు సెలవు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఆమె గైర్హాజరీతో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పదవి ఖాళీ కానున్న నేపథ్యంలో, అశోక్ గెహ్లాట్‌తో పాటు సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, శక్తిసిన్హ్ గోహిల్ పేర్లను కూడా అధిష్ఠానం పరిశీలిస్తోంది. అయితే, అపార రాజకీయ అనుభవం ఉన్న గెహ్లాట్ వైపే పార్టీ అగ్రనాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

దీపా దాస్‌మున్షీ స్థానంలో 2025 ఫిబ్రవరి 14న మీనాక్షి నటరాజన్ తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు



స్వీకరించారు. గతంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆమె ఏఐసీసీ పరిశీలకురాలిగా కూడా వ్యవహరించారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన ఆమె, 2009లో మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 30,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాగా, తెలంగాణ కొత్త ఇన్‌చార్జ్ నియామకంపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరించే అవకాశం ఉంది.

# అసెంబ్లీ గేటు వద్ద వివాదం కేసు.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 14:**
తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సమయంలో చోటుచేసుకున్న వివాదానికి సంబంధించి నమోదైన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ), ప్రజా సంబంధాల అధికారి (పీఆర్ఓ) సోమవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. సైఫాబాద్ పోలీసులు జారీ చేసిన నోటీసుల మేరకు కేటీఆర్ పీఆర్ఓ మాణిక్య మహేశ్, పీఏ కుంబాల మహేందర్ రెడ్డి దర్యాప్తు అధికారి ఎదుట హాజరై తమ వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ ప్రాంగణం వద్ద విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకున్నారన్న ఆరోపణలపై వీరిద్దరిపై సెప్టెంబర్ 9న కేసు నమోదైంది. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి. జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద సైఫాబాద్ పోలీసులు వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ క్రమంలోనే కేటీఆర్ సహాయకులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం, దర్యాప్తును కొనసాగించేందుకు మాత్రం అనుమతినిచ్చింది. ఈ నెల 7న కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉన్న నల్ల టీ-షర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లారు. అయితే, రాజకీయ నినాదాలు ఉన్న దుస్తులతో లోపలికి అనుమతించేది లేదని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి కేటీఆర్, హరీశ్‌రావు సహా 12 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయి. మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, వారిని దూషించారన్నది ప్రధాన ఆరోపణ. అదేవిధంగా, అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ప్రత్యేకంగా కేసు నమోదైంది. మరోవైపు, పోలీసులు తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు.

# కుటుంబంతో కలిసి గణపతి పూజలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 14:**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఆయన తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి గణపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. ప్రజలందరి జీవితాల్లో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలో పాల్గొన్న ఫొటోలను ఆయన ఈ సందర్భంగా షేర్ చేశారు. "వినాయక చవితి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి గణపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నాను. ప్రజలందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి, విజయాలు సిద్ధించాలని ప్రార్థిస్తూ, రాష్ట్ర ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు.



# మరో 18 నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ప్రకటించిన కవిత.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 14:**
రాష్ట్ర రాజకీయాల్లో సొంత పార్టీ తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసుకునే దిశగా ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత శరవేగంగా అడుగులు వేస్తున్నారు. సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆమె, తాజాగా వినాయక చతుర్థి శుభసందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ పరంగా పలు కీలక నియామకాలను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 18 కీలక అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ఖరారు చేయడంతో పాటు, పలు జిల్లాలకు నూతన అధ్యక్షులను, అనుబంధ విభాగాల వారీగా బాధ్యులను నియమిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ తాజా జాబితాతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలోని మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జుల నియామకం పూర్తయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, నాంపల్లి, అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నంతో పాటు ఉత్తర, దక్షిణ తెలంగాణలోని ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఖానాపూర్, నిర్మల్, హుజూరాబాద్, దేవరకొండ, ఇల్లందు, అశ్వారావుపేట నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించారు. దీనికి తోడు మెదక్ లోక్‌సభ స్థానానికి కూడా పార్టీ అధ్యక్షుడిని ప్రకటించడం ద్వారా తెలంగాణ రక్షణ సేన రాబోయే ఎన్నికల వ్యూహానికి సమరశంఖం పూరించినట్లయింది.



# అల్వాల్‌లో దారుణం: ఇంటర్ విద్యార్థినిపై 8 మంది అత్యాచారం!

**వివరాల ప్రకారం..** మచ్చబొల్లారానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. పదో తరగతిలో ఉన్నప్పుడు జెర్రీ వరుణ్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం, ఆ యువకుడు చాక్లెట్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి, తన కారులోనే బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో మొదలైన నరకం నెలలపాటు కొనసాగింది. ఆ తర్వాత జెర్రీ వరుణ్ ద్వారా రొమాల వరుణ్ అనే మరో యువకుడు పరిచయమయ్యాడు. అతడు బాలికకు మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలు అలవాటు చేసి, కొంపల్లిలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. వీరే కాకుండా, డేవిడ్ వరుణ్ అనే ఇంకో వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై, మద్యం తాగించి అసభ్యంగా ప్రవర్తించాడు. కుమార్తె ప్రవర్తనలో మార్పు గమనించిన తండ్రి ఈ నెల 9న ఆమెను మందలించడంతో, బాలిక ఇల్లు వదిలి బొల్లారం రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ పరిచయమైన నీరజ్ అనే వ్యక్తి, తన స్నేహితుడు విక్కీని పిలిపించాడు. ఇద్దరూ కలిసి బాలికకు మత్తుమందు ఇచ్చి, వేర్వేరుగా అత్యాచారం చేశారు. అక్కడితో ఆగకుండా, విక్కీ తన మరో స్నేహితుడు నిఖిల్‌తో కలిసి బాలికను దూలపల్లిలోని ఓయో గదికి తీసుకెళ్లాడు. అక్కడ నిఖిల్, అతడి ఇద్దరు స్నేహితులతో కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ రాత్రి బాధితురాలిని విక్కీ తన ఇంట్లో బంధించాడు. 10వ తేదీన అక్కడి నుంచి తప్పించుకున్న బాలిక మళ్లీ బొల్లారం రైల్వే స్టేషన్‌కు చేరుకోగా.. విక్కీ, అతడి స్నేహితుడు గణేశ్ కలిసి అడ్డుకున్నారు. వారు బాలికను బలవంతంగా మత్తులోకి దించి మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడ రైలులో మరోసారి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం మల్కాజిగిరికి చేరుకుని, ధూల్‌పేటకు ఆటోలో వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా బాధితురాలు వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది. ఇంటికి వచ్చిన బాలిక, జరిగిన ఘోరాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు వెంటనే అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# సంతా.. మా ఊరి సంతా..!

- పశువుల సంత.. తైబజార్‌లో సౌకర్యాలు కరువు.
- ఆదాయంపై ఉన్న శ్రద్ధ.. రైతులు, వ్యాపారులకు సౌకర్యాలపై లేదా?
- సంత ఆదాయం అరకోట్లు.. సౌకర్యాలు మాత్రం ఎక్కడ?
- చినుకు పడితే చిత్తడే.. సంతనా? చిన్న కుంటలా?
- తాగునీరు.. మరుగుదొడ్లు కరువు.. మహిళల అవస్థలు.
- మూగజీవాల పరిస్థితి ఏమిటి..? అధికారుల పర్యవేక్షణ ఏది?

**కురవి, సెప్టెంబర్ 14 (జనం వాయిస్) :**

ప్రజా కవి గోరేటి వెంకన్న పాడిన "సంతా మా ఊరు సంతా" పాటను తలపించేలా మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి సోమవారం పశువుల సంత, తైబజార్ నిర్వహిస్తున్నారు. ప్రసిద్ధ శ్రీ వీరభద్ర స్వామి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి రైతులు, పశువుల యజమానులు, వ్యాపారులు సంతకు తరలివస్తుంటారు. అయితే సంత ద్వారా గ్రామ పంచాయతీకి గణనీయమైన ఆదాయం వస్తున్నప్పటికీ, అందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సంత ఆదాయం అరకోటి.. సౌకర్యాలు మాత్రం ఎక్కడ?**

ప్రతి ఏడాది సంత, తైబజార్ నిర్వహణ ద్వారా గ్రామ పంచాయతీకి సుమారు అరకోటి వరకు ఆదాయం వస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. కానీ రైతులు, వ్యాపారులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆదాయం వస్తున్నప్పుడు దానికి తగ్గట్టుగా సౌకర్యాలు ఎందుకు కల్పించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**చినుకు పడితే చిత్తడే.. సంతనా? చిన్న కుంటలా?**

వర్షం పడితే సంత ప్రాంగణం మొత్తం బురదమయంగా మారి, వర్షపు నీరు నిలిచిపోయి చిన్న కుంటలను తలపిస్తోందని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. పశువులను తీసుకొచ్చే రైతులు, కొనుగోలుదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అసౌకర్యం కారణంగానే ప్రతి ఏడాది సంత టెండర్ ఆదాయం తగ్గే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు.

**తాగునీరు.. మరుగుదొడ్లు కరువు.. మహిళల అవస్థలు**

వివిధ గ్రామాల నుంచి సంతకు వచ్చే మహిళలకు కనీసం తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం తీవ్ర సమస్యగా మారింది. గంటల తరబడి సంతలో ఉండే రైతులు, వ్యాపారులు ఎండలో, వానలోనే కాలం గడపాల్సి వస్తోంది. మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్ల సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**మూగజీవాల పరిస్థితి ఏమిటి..? అధికారుల పర్యవేక్షణ ఏది?**

పశువుల సంతకు పెద్ద సంఖ్యలో పశువులు వస్తున్నప్పటికీ వాటికి తాగునీరు, నీడ, నీటి తొట్టెలు వంటి సౌకర్యాలు ఉన్నాయా? అనే




ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశువుల ఆరోగ్య పరీక్షలు, పారిశుద్ధ్యం, చెత్త తొలగింపు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు వంటి అంశాలపై సంబంధిత అధికారులు, పాలకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారా అనే దానిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**ఆదాయంపై శ్రద్ధ.. సౌకర్యాలపై ఎందుకు లేదు?**

తైబజార్, పశువుల సంత పేరుతో వసూలు చేస్తున్న రుసుములకు నిబంధనల ప్రకారం టెండర్ విధానం ఎలా జరిగింది? ఎంత ఆదాయం వస్తోంది? ఆ ఆదాయాన్ని ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు? అనే వివరాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలోనూ చూపించాలని కోరుతున్నారు.

**ఇకనైనా మేల్కొంటారా..?**

కురవి పశువుల సంత, తైబజార్‌ను అధికారులు, పాలకులు తక్షణమే పరిశీలించి తాగునీరు, మరుగుదొడ్లు, డ్రైనేజీ, షెడ్లు, నీడ, పశువులకు నీటి తొట్టెలు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతులు, వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. సంత ద్వారా వచ్చే ఆదాయానికి తగ్గట్టుగా అభివృద్ధి పనులు చేపట్టి, ఆదాయ--వ్యయ వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందిస్తారా.. లేక "సంతా మా ఊరి సంతా" సమస్యల సంతగానే మిగిలిపోతుందా..? వేచి చూడాల్సిందే.

**అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి**

ఒకప్పుడు కోట్ల రూపాయల ఆదాయం అందించిన కురవి పశువుల సంత ప్రస్తుతం కేవలం రూ.30.40 లక్షల ఆదాయానికి పడిపోయిందని సీపీఐ కురవి టౌన్ కార్యదర్శి తురక రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సంత అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. "ఆదాయం ఎందుకు ఇంతగా పడిపోయిందో ఆ వీరభద్రస్వామికే తెలుసు. ఇకనైనా పశువుల సంతను అభివృద్ధి చేసి రైతులు, వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి" అని తురక రమేష్ డిమాండ్ చేశారు.




## మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు.**

**జనం వాయిస్, మంచిర్యాల, సెప్టెంబర్ 14:**

వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పిలుపునిచ్చారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వాసవి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ వద్ద వాసవి క్లబ్, యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం కారణంగా నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని తెలిపారు. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించడం కేవలం పూజా విధానం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు తీసుకునే బాధ్యతాయుతమైన నిర్ణయమని పేర్కొన్నారు. వాసవి క్లబ్, యూత్ క్లబ్ సభ్యులు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చేపట్టిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభినందించారు. భక్తులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, టీపీసీసీ సభ్యులు కొండా శేఖర్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వాసవి క్లబ్, యూత్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పెరక సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు రూ.20 లక్షల చేయూత

**జనం వాయిస్, మంచిర్యాల, సెప్టెంబర్ 14:**

పెరక సంఘం అభివృద్ధికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అండగా నిలిచారు. పెరక సంఘం భవన నిర్మాణం కోసం రూ. 20 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా మంచిర్యాల జిల్లా పెరక సంఘం నాయకులు ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి, ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, జిల్లా పెరక సంఘం అధ్యక్షులు బొడ్డు శంకర్, పెరక ట్రస్ట్ బీఆర్ లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు బొడ్డు తిరుపతి, డాక్టర్లు బొడ్డు రఘునందన్, ముత్తినేని అనిల్‌కుమార్, జిల్లా నాయకులు మానయ్య, చుంచు సదానందం, గూడ గోపి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జాలే రాయలింగు, జిల్లా ఓబీసీ చైర్మన్ వొడ్డే రాజమౌళి, ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, ఆత్మ కమిటీ చైర్మన్ సింగతి మురళి, పట్టణ మహిళా అధ్యక్షురాలు గజ్జల హేమలత, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, జిల్లా అధికార ప్రతినిధి బియ్యాల తిరుపతి, సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దైనమిక్ జనం వాయిస్ RNI NO:TGTEL/26/A0383 తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM



# చెట్టు తొలగింపుతో ఊపిరి పీల్చుకున్న వాహనదారులు.

## ఎస్సై పరమేష్ చొరవతో రోడ్డుకు అడ్డంకి తొలగింపు

**జనం వాయిస్, శాయంపేట, సెప్టెంబరు 14:** మాందారిపేట నుంచి శాయంపేటకు వెళ్లే మార్గంలో రంగయ్యకుంట సమీపంలో ఆదివారం విరిగి రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షాన్ని శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం రాత్రివేళ తొలగించింది. ట్రాక్టర్ డోజర్, కట్టర్ సహాయంతో చెట్టును ముక్కలుగా కట్ చేసి, డోజర్‌తో రహదారి పక్కకు తరలించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఏర్పడిన అంతరాయం తొలగిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై పరమేష్ వెంటనే స్పందించి పోలీసు సిబ్బందితో కలిసి రాత్రి సమయంలో చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు. చెట్టును తొలగించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.



### గుంతల రహదారిపై మాత్రం

### కొనసాగుతున్న ఇబ్బందులు..

చెట్టు తొలగిపోయినా రంగయ్యకుంట సమీపంలోని రహదారి గుంతలమయంగా ఉండటంతో వాహనదారుల ఇబ్బందులు మాత్రం కొనసాగుతున్నాయి. వర్షపు నీరు గుంతల్లో చేరడంతో అవి కనిపించక ప్రమాదాలకు దారితీసే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# గణపతి ఉత్సవాల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 14:** మందమర్రి పట్టణ మార్కెట్‌లో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పాల్గొని గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో వర్తక సంఘం (బి జోన్) ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణేష్ మండలి నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. కార్యక్రమాల్లో వర్తక సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 15 ఏళ్లుగా ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 14:** తెలంగాణ కుమ్మరి సంఘం, బ్రైట్ కంప్యూటర్స్ ఇంటర్నెట్, మీసేవ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా మందమర్రిలో ఉచిత మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా మీసేవ యజమాని కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. కుమ్మరి బంధువులు భక్తిశ్రద్ధలతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారని తెలిపారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా వినాయకుడి ఆశీస్సులు పొందడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. మట్టి విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల



జలచరాలకు హాని కలగదని పేర్కొన్నారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# దళిత బాలికలంటే అధికారులకు ఎందుకింత నిర్లక్ష్యం..?

**... మౌలిక వసతుల్లేని అద్దె భవనంలో విద్యార్థినుల అవస్థలు**
**... ఫిర్యాదులు చేసినా స్పందన కరువు!**
**... ఇదేనా ప్రజాపాలన..? దళిత బాలికలపై చిన్నచూపా..?**
**... అధికారుల మౌనం వెనుక కారణమేంటి?**
**... ప్రైవేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్య ఎక్కడ..?**
**... ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా కదలని అధికార యంత్రాంగం..**
**బాధ్యత ఎవరిది?**
**... అధికారుల ఆదేశాలూ బుట్టదాఖలేనా..?**
**... అద్దె భవనం నుంచి సురక్షిత భవనానికి తరలించాలని డిమాండ్**
**... దళిత రత్న దైద భద్రయ్య, బిఎస్పీ రాష్ట్ర కన్వీనర్ మంద శశికుమార్.**

**కురవి, సెప్టెంబర్ 14 (జనం వాయిస్):** దళిత విద్యార్థులు సకల సౌకర్యాలతో ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ.. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ ఎస్సీ బాలికల వసతి గృహం పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని దళిత నాయకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**20 ఏళ్లుగా ప్రశ్నార్థకంగా మారిన శిలాఫలకం :**
కురవి మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ వసతి గృహం నూతన భవన నిర్మాణానికి 2007లో అప్పటి డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు డి.ఎస్. రెడ్యానాయక్ శిలాఫలకం వేసి శంకుస్థాపన చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఇంతకాలం గడిచినా నూతన భవన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

**అద్దె భవనంలో బాలికలకు ఇబ్బందులు**
ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను కురవి గ్రామంలో ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ఆ భవనంలో తగిన మౌలిక వసతులు, భద్రతా సౌకర్యాలు లేవని విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రైవేట్ కార్పొరేట్ విద్యకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్న పాలకులు.. కనీస వసతులు లేని వసతి గృహాలపై ఎందుకు దృష్టి సారించడం లేదని వారు నిలదీస్తున్నారు.

**వినతులు ఎన్నో.. స్పందన ఏది?**
ఈ సమస్యపై కురవి మండల కేంద్రానికి చెందిన దళిత నాయకులు దళిత రత్న, వార్డు సభ్యులు దైద భద్రయ్య, కిన్నెర మల్లయ్య, ఇరుగు వెంకన్నలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజావాణి, సంబంధిత శాఖ జిల్లా అధికారులకు, కురవి ప్రజావాణిలో ఎంపీడీవో వీరబాబుకు సైతం



వినతిపత్రాలు సమర్పించినట్లు వారు పేర్కొన్నారు. అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**సౌకర్యవంతమైన భవనానికి మార్చాలని ఆదేశాలున్నా..**
సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను మరో సౌకర్యవంతమైన భవనంలోకి మార్చేందుకు ఆదేశాలు జారీ అయినట్లు స్థానికంగా చర్చ జరుగుతున్నప్పటికీ, అమలు మాత్రం ఎందుకు జరగడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు ఉన్నారా? లేదా? అధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితమవుతున్నాయా? విద్యార్థినుల భద్రత, మౌలిక వసతుల విషయంలో ఇంత నిర్లక్ష్యం ఎందుకు? అంటూ దళిత నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నూతన ఎస్సీ బాలికల వసతి గృహం నిర్మించాలి
కురవి మండల కేంద్రంలో అన్ని మౌలిక వసతులు, భద్రతా సౌకర్యాలతో కూడిన నూతన ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంజూరు చేసి నిర్మించాలని దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుత హాస్టల్‌ను తక్షణమే సురక్షితమైన, అన్ని మౌలిక వసతులు ఉన్న భవనంలోకి తరలించాలని కోరుతున్నారు.

**లేకుంటే ఉద్యమం తప్పదు..,**
ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థినుల సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థి సంఘాలు, దళిత సంఘాలను ఐక్యం చేసి ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని దళిత నాయకులు హెచ్చరించారు. దళిత విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదా? 'ప్రజాపాలన'లో దళిత బాలికల వసతి సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందో అధికారులే సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

**అధికారులపై చర్యలు తీసుకోవాలి : బిఎస్పీ రాష్ట్ర కన్వీనర్ మంద శశికుమార్**
ఎస్సీ బాలికల వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఎస్పీ రాష్ట్ర కన్వీనర్ మంద శశికుమార్ అన్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్టల్‌ను అన్ని మౌలిక వసతులు ఉన్న భవనంలోకి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా అద్దె భవనంలో హాస్టల్ నిర్వహిస్తున్న అధికారుల తీరుపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ బాలికల కోసం నూతన హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని, అప్పటివరకు అన్ని సౌకర్యాలు ఉన్న భవనంలో హాస్టల్‌ను నిర్వహించాలని సూచించారు. అధికారులు స్పందించి విద్యార్థినుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని శశికుమార్ హెచ్చరించారు.



# సింగరేణి 62వ వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం

## కబడ్డీలో కాసిపేట-2 విజయం.. కేకే-5 రన్నరప్

**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 14:** సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 62వ వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలు సోమవారం మందమర్రి ఏరియాలో ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక సింగరేణి మైదానంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కబడ్డీ క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, తక్షణ నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. కబడ్డీ పోటీల్లో కాసిపేట-2 జట్టు విజేతగా, కేకే-5 జట్టు రన్నరప్‌గా నిలిచింది. స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీను, ఉద్యోగులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



# మంథని రెడ్డి భవన్ లో విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు



**జనం వాయిస్, మంథని, సెప్టెంబర్ 14** పెద్దపెల్లి జిల్లా మంథని లోని రెడ్డి భవన్ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మొదటి రోజు పూజ చేసిన మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మాట్లాడుతూ మంథని ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ గణనాధుని ఆశీస్సులు ఎల్లవేళ అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు రెడ్డి భవన్ అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# మందమర్రిలో వీధికుక్కల స్వైర విహారం.. భయాందోళనలో ప్రజలు

**30--50 కుక్కలు.. గుంపులుగా దాడులు! గణపతి నవరాత్రుల వేళ చిన్నారులు, వృద్ధులకు పొంచి ఉన్న ప్రమాదం.**



**జనం వాయిస్, మందమర్రి, సెప్టెంబర్ 14:** మందమర్రి పట్టణంలో వీధికుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. ముఖ్యంగా 12వ వార్డులోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లైన్ పరిసరాల్లో సుమారు 30 నుంచి 50 వరకు కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట మాత్రమే కాకుండా పగటిపూట కూడా ప్రధాన రహదారులు, ఇళ్ల పరిసరాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం గణపతి నవరాత్రులు ప్రారంభం కావడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమయంలో కుక్కలు ఒక్కసారిగా గుంపులుగా ఎగబడటం, వెంబడించడం, దాడికి ప్రయత్నించడం వల్ల ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఉదయం--సాయంత్రం వేళల్లో నడిచే వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 12వ వార్డుకే పరిమితం కాకుండా మందమర్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. కుక్కల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వాటి నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడదను నిర్లక్ష్యం చేస్తే ఎప్పుడైనా చిన్నారులు, వృద్ధులపై తీవ్ర దాడులు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని, కుక్కల నియంత్రణకు చట్టబద్ధమైన చర్యలు చేపట్టడంతో పాటు జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. గణపతి నవరాత్రుల నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారకముందే అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిష్ఠించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి

**సెప్టెంబర్ 14 జనం వాయిస్ పాలకుర్తి:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మట్టి గణపతిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ వినాయక స్వామి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని కృపతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నాయకత్వంలో పాలకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ప్యారా) గణపతుల వల్ల చెరువులు, నదులు, నీటి వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని అన్నారు. అందుకే ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో మట్టి గణపతినే ప్రతిష్ఠించి పర్యావరణ హిత వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి గణపతి వినియోగం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించవచ్చని ఆమె తెలిపారు. వినాయకుని ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరూ ఆనందంగా, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన నాయకులు, అభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



దైనమిక్ జనం వాయిస్ RNI NO:TGTEL/26/A0383 తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
మంగళవారం 15 సెప్టెంబర్ 2026

# వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం

## ఈనెల 15న పాలకుర్తిలో ప్రారంభమయ్యే వీర వనితల స్ఫూర్తి యాత్రను జయప్రదం చేయండి సిపిఎం

**సెప్టెంబర్ 14 జనం వాయిస్ పాలకుర్తి:**
వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి మత ఘర్షణలు చరిత్రగా చిత్రీకరించడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య పిలుపునిచ్చారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ నిర్వహించారు. ఈ సమావేశానికి ముస్కు ఇంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ దొరలు భూస్వాముల దోపిడి వెట్టి చాకిరికి వ్యతిరేఖంగా పేదలు రైతులు, కూలీలు ఐక్యంగా సాధించిన పోరాటమే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు. ఆనాడు స్వేచ్ఛ వాయు పీల్చుకోలేని పరిస్థితుల్లో దోపిడికి వ్యతిరేకంగా అణిచివేతకు వ్యతిరేకంగా జాగిందర్ జమిందార్ విధానాన్ని వ్యతిరేకిస్తూ దున్నేవాడికి భూమి కావాలని ఎర్రజెండా పిలుపునిచ్చిందని ఆనాటి పిలుపుని అందుకొని నేటి వరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలు నిర్వహిస్తుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి నాయకులు ఈ పోరాటాన్ని హిందూ ముస్లిం ఘర్షణగా చిత్రీకరిస్తుందని విమర్శించారు, ప్రజల హక్కులు భూమికోసం సాగిన పోరాటాన్ని మతపరమైన కోణంలోకి లాగడం చరిత్రను వక్రీకరించడమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడుస్తున్న నీటికి నిరుద్యోగ సమస్య



పరిష్కరించడంలో విఫలమైందన్నారు.సాయుధ పోరాటం అంటేనే పాలకుర్తి ప్రాంతం గుర్తుకు వస్తుందని, జనగామ ప్రాంతం వీరుల పుట్టినిల్లు అని వారు కొనియాడారు. ఈనెల 15న పాలకుర్తి లోని వీరనారి ఐలమ్మ విగ్రహం ఎదుట వీరవనితల స్ఫూర్తి యాత్ర ప్రారంభమవుతుందని ఈ ప్రారంభ యాత్రకు ఐద్వా జాతీయ కార్యదర్శి కానినిక గోష్ గారుజాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్ పుణ్యవతి గారు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని మహిళలు పార్టీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు,ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోమసత్యం, మాసంపల్లి నాగయ్య,ఏదునూరి మదార్, బెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు

# సీసీ రోడ్లు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి

## ఐప్వా రాష్ట్ర కార్యదర్శి అనంతోజు రజిత

**సెప్టెంబర్ 14 జనం వాయిస్ పాలకుర్తి:**
పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పాలకుర్తి బస్‌స్టేషన్ అధ్వాన్నంగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐప్వా) రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతోజు రజిత విమర్శించారు. సోమవారం ఆమె పాలకుర్తి బస్‌స్టేషన్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్‌స్టేషన్ ఆవరణలో సీసీ రోడ్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు రజిత దృష్టికి తీసుకువచ్చారు. వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో బస్సులు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గుంతల్లో నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని, దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వినియోగించే బస్‌స్టేషన్‌లో కనీస మౌలిక వసతులు లేకపోవడం పట్ల రజిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలోని బస్‌స్టేషన్ పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. బస్‌స్టేషన్ ఆవరణలో సీసీ రోడ్లు నిర్మించి గుంతల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సంబంధిత అధికారులు తక్షణమే బస్‌స్టేషన్ సమస్యలను పరిశీలించి అభివృద్ధి పనులు చేపట్టాలని అనంతోజు రజిత డిమాండ్ చేశారు.





# గాలివారి గూడెంలో ఘనంగా ఘననాథుని ఉత్సవాలు.

## ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పండుగ సందడి.
## ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి.



**మరిపెడ,సెప్టెంబర్ 14(జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని గాలివారి గూడెం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు.గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ పండుగ సందడి నెలకొంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వినాయక మండపాలను కేవలం పండుగ సంబరాలకే పరిమితం చేయకుండా, భక్తి భావాన్ని పెంపొందించే కార్యక్రమాలకు వేదికలుగా తీర్చిదిద్దాలని సూచించారు. మండపాల్లో భక్తి పాటలు వినిపించేలా ఏర్పాట్లు చేయాలని,చిన్నారులు, యువతలో మన ఆచారాలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.ముఖ్యంగా పిల్లల కోసం ఆధ్యాత్మిక, సాంస్కృతిక అంశాలపై క్విజ్ పోటీలు, నాట్య పోటీలు నిర్వహించి వారి ప్రతిభను వెలికితీయడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తి కలిగించేలా చూడాలని కోరారు. వినాయక ఉత్సవాల సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పిల్లలకు చిన్ననాటి నుంచే మంచి విలువలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, యువత, ఉత్సవ కమిటీ సభ్యులు ఐక్యంగా పాల్గొని ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని ఆమె కోరారు.వినాయక మండపం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేసినారు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. అలాగే ఉత్సవ కమిటీ వారికి గ్రామస్థులందరూ సహకరించాలని కోరారు..



